స్థానిక ఎన్నికల్లో స్వతంత్రంగానే సిపిఎం పోటీ

- ఎన్నికలొచ్చినప్పుడు ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి
- బిజెపి రూపంలో ఫెడరలిజానికి ప్రమాదం
- సార్వభౌమాధికారాన్ని దెబ్బతీస్తున్న మోడీ-ట్రంప్ :తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం స్వతంత్రంగానే పోటీ చేస్తుందని, ఇప్పటికే రాష్ట్ర, జిల్లా కమిటీలు విధాన నిర్ణయం చేశాయని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో సిపిఎం సీనియర్ నాయకులు, నందిపాడు మాజీ సర్పంచ్ ఊకే వీరాస్వామి సంస్మరణ సభ గురువారం జరిగింది. ఇందులో తమ్మినేని పాల్గొన్నారు. అనంతరం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఒకటి, రెండు హామీలను అమలు చేసినా అవి కూడా పూర్తిస్థాయిలో కాలేదని తెలిపారు. హామీల అమలుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాఉద్యమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడువచ్చినా సిద్ధంగానే ఉన్నామని, ఒంటరిగానే పోటీ చేయాలనుకున్నామని, ఎవరైనా కలిసి వస్తే ఆలోచన చేస్తామని అన్నారు. పోరాట పంథాను విడవబోమని, జడ్‌పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మతోన్మాదం, నయా ఉదారవాదం భారత దేశానికి పట్టిన రాహు కేతువులని, వీటిని నిలువరించకపోతే ప్రజాస్వామ్యానికి మనుగడే ఉండదని తమ్మినేని అన్నారు. దేశంలో నేడు రెండు పార్శ్వాలు కనపడుతున్నాయని, అందులో పెట్టుబడిదారులు, కార్పొరేట్లు, ధనవంతుల భారత దేశం ఒకటయితే.. పేదలు, కష్టజీవులు, కార్మికులు, శ్రామికులు రెండో భారతదేశం అని వ్యాఖ్యానించారు. నాడు తెల్ల బ్రిటీష్ వ్యాపారులకు వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకుంటే, నేడు స్వదేశీయులే వ్యాపారులయ్యి దేశ సంపదను కొల్లగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ లౌకిక విధానం, ఫెడరలిజానికి.. బిజెపి రూపంలో ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన తంతుగా మారిందని, స్వయాన కేంద్ర ఎన్నికల సంఘమే కేంద్ర ప్రభుత్వానికి నకిలీ, దొంగ ఓట్లు చేర్పింపులో సహకరిస్తున్నదని అన్నారు. బీహార్‌లో లక్షలాది ఓట్లు నకిలీ అని రాహుల్ గాంధీ ప్రదర్శించారని, ఇది దేశవ్యాప్త సమస్యగా మారే అవకాశం ఉందని తెలిపారు. మోడీ-ట్రంప్.. తాము మంచి స్నేహితులం అంటూనే భారతదేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ట్రంప్ అమెరికాకు మాత్రమే అధ్యక్షులని, ఆయన ఇతర దేశాలపై పెత్తనం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో సహకరించే దేశాలు చాలా ఉన్నాయని, వాటితో భారతదేశం స్నేహ సంబంధాలు కొనసాగించాలని అన్నారు. నెహ్రూ కాలం నుంచి రష్యా స్నేహ దేశంగా ఉండేదని గుర్తు చేశారు. సుంకాల పేరుతో ట్రంప్ ప్రపంచంపై గుత్తాధిపత్యం చెలాయిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మతోన్మాదం, పెట్టుబడిదారీ విధానం, దోపిడీ నుంచి ప్రజలను విముక్తి చేయడానికి దేశవ్యాప్త ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా పట్ల గత ప్రభుత్వం మాదిరే కాంగ్రెస్ ప్రభుత్వమూ వివక్ష చూపుతుందని అన్నారు. నలుగురు ముఖ్యమంత్రులు మారినా సీతారామ ప్రాజెక్ట్‌ను మాత్రం నేటికీ పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు గంగరాజు, మడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ చరిత్రలో స్వాతంత్ర్యం వచ్చిన రోజు ప్రత్యేకమైన రోజు ఆయన అభివర్ణించారు. మాతభూమికి స్వేచ్ఛను బహుమానంగా ఇచ్చేందుకు తమ జీవితాలను ధైర్యంగా త్యాగం చేసిన దేశభక్తులను స్మరించుకోవడాన్ని స్వాతంత్ర్య దినోత్సవం ప్రతిబింబిస్తున్నదని తెలిపారు. అంకితభావంతో, నిస్వార్థంగా మన భవిష్యత్తు కోసం నిలిచిన వీరులకు నివాళులు అర్పించుకుంటున్నామని చెప్పారు. వారి త్యాగం స్వచ్ఛ నిర్మాణానికి పునాది అని పేర్కొన్నారు. జెండా వందనం చేసే సమయంలో మనమంతా బలోపేతమైన, స్వావలంబనతో కూడిన ఆత్మనిర్భర్ భారత్ కోసం పునరంకితమవుదామని గవర్నర్ సూచించారు. భారతదేశం ప్రగతిని, శాంతిని అందరికి అందించాలని ఆకాంక్షించారు. రేపటి ఉజ్వల భవిష్యత్తు కోసం మనమంతా ఐక్యంగా నిలబడుదామని పిలుపునిచ్చారు. ఆకాశంలో ఎప్పుడూ ఉన్నతంగా కనిపించే త్రివర్ణాలు త్యాగధనుల ధైర్యం, శాంతి, విశ్వాసం మనకు స్ఫూర్తినివ్వాలని ఆయన ఆకాంక్షించారు.


స్థానిక మహిళలతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- స్థానిక సమస్యలు పరిష్కరించాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కోరారు. కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్ కాలనీల్లో ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా స్థానిక సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కోతిరాంపూర్‌లో డ్రయినేజీ సౌకర్యం సరిగా లేక ఇండ్లల్లోకి మురుగు నీరు వస్తోందని, పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, దోమలు విజృంభిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఎదుట రోడ్డు గుంతలు పడి ఇబ్బందులేర్పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. తలాపుననే మానేరు డ్యాం ఉన్నా.. రోజు తాగునీరు సరఫరా కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలను అణచివేస్తున్నారని, లైంగికంగా వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ, గుడికందుల సంధ్య, మంచినీళ్ల లావణ్య, ఉప్పునూటి లక్ష్మి, స్రవంతి, భవాని, రామ రజిని, మున్నా అంజలి పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ అభ్యర్థుల రిపోర్టింగ్ గడువు 20 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బీఎడ్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల 20 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఎడ్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ పాండురంగారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, వరుస సెలవుల నేపథ్యంలో కేటాయించిన కాలేజీల్లో రిపోర్టింగ్ చేసే గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించామని తెలిపారు. ఇతర వివరాల కోసం https://tgedcetadm.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు. ఎడ్‌సెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 17,151 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారు. బీఎడ్ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో 14,295 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 9,955 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించారు.

మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- 18నుంచి 30 వరకు టెండర్ షెడ్యూల్
- మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గంగపుత్ర, ముదిరాజ్ తరగతుల అభివృద్ధికి సర్కారు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 33 జిల్లాల్లోని 26,326 నీటివనరులలో రూ.93.62కోట్ల వ్యయంతో 84.62 కోట్ల చేపపిల్లలను వంద శాతం గ్రాంటుపై విడుదల చేసేందుకు ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు.పది కోట్ల రొయ్య పిల్లలను ఎంపిక చేసిన 300 నీటి వనరులలోరూ.28.60 కోట్ల వ్యయంతో వంద శాతం గ్రాంటుపై విడుదల చేయనున్నట్టు తెలిపారు.ఈ నెల 18 నుండి 30 వరకు టెండర్ ప్రక్రియ కొనసాగుతున్నట్టు తెలిపారు.తద్వారా 6,152 మత్స్యకార సంఘాలకు చెందిన 4.21 లక్షల మత్స్యకారులు, పరోక్షంగా సుమారు పది లక్షలమందికి ఆదాయం, జీవనోపాధి స్థిరపడుతుందని పేర్కొన్నారు. గతంలో చేపపిల్లల సరఫరాలో ఉన్న లోటుపాట్లను పరిగణలోకి తీసుకుని పారదర్శకంగా నిర్వహిస్తుందని తెలిపారు. మధ్యవర్తుల జోక్యాన్ని ఏ మాత్రం అనుమతించబోమని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో అత్యాధునిక చేపల మార్కెట్‌ను నిర్మిచంనున్నామని పేర్కొన్నారు.అదే విధంగా శేరిగూడ, నిజామాబాద్ జిల్లాలోఅర్చపల్లి రూ. రెండు కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నట్టు తెలిపారు. మహిళా సాధికారత కోసం సెర్ప్ సహకారంతో మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళలకు 35 మొబైల్ చేపల రిటైల్ ఔట్‌లెట్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. మత్స్య కారులకు తక్షణం వలలు, పడవలు, ఆధునిక పరికరాలు, రవాణా వాహనాలను అందజేయనున్నట్టు స్పష్టం చేశారు. సమగ్ర సంక్షేమ చర్యలతోపాటు వారి అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్టు మంత్రి శ్రీహరి వెల్లడించారు.

దేశంలో యూరియా కొరత లేదనడం అవగాహనారాహిత్యం

- బిజెపి చీఫ్‌పై తుమ్మల ఆగ్రహం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలోనూ, రాష్ట్రంలోనూ యూరియా కొరత లేదనడం బిజెపి అధ్యక్షులు రామచందర్‌రావు అవగాహనారాహిత్యానికి నిదర్శనమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇవిగో సాక్ష్యాలంటూ గురువారం మంత్రి ఆయనకు లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వమే యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండించారు. 'రాష్ట్రానికి కేంద్రం ఎంత యూరియా కేటాయించింది. ఎంత సరఫరా చేసింది అనే వాస్తవాలను ముందుగా రామచందర్‌రావు తెలుసుకోవాలి' అని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాదు... పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో కూడా యూరియా కొరత ఉందని పేర్కొన్నారు. బిజెపిది రైతు మిత్ర ప్రభుత్వం కాదని, రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆయన విమర్శించారు. యూరియాపై మాట్లాడేటప్పుడు అన్ని వివరాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఆ తర్వాత సిబిఐ విచారణ వంటి ప్రగల్భాలు పలకాలని మంత్రి హితవు పలికారు.

19 నుంచి డిసెట్ స్పాట్ అడ్మిషన్లు

- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిప్లొమ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఐఇడి), డిప్లొమ ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డిపిఎస్ఇ)లో 2025-27 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 19 నుంచి డీసెట్ కౌన్సెలింగ్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రారంభం కానుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ జి రమేష్ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. డైట్ కాలేజీలు, కేటగిరీల వారీగా ఖాళీల వివరాలను ఈనెల 17న www. deecet. cdse. telangana.gov.in వెబ్‌సైట్‌లో విడుదల చేస్తామని తెలిపారు. అదేనెల 18న మీడియాలో నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. 19న ప్రభుత్వ డైట్ కాలేజీలు, 20న ప్రయివేటు డైట్ కాలేజీల వద్ద అభ్యర్థులు అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఆయా తేదీల్లో స్పాట్ అడ్మిషన్లను కేటాయిస్తామని తెలిపారు. ఈనెల 21న ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు. అదేనెల 22న సాయంత్రం ఆరు గంటల వరకు స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశాలు పొందిన అభ్యర్థుల వివరాలను డీసెట్ వెబ్‌సైట్‌లో కాలేజీల ప్రిన్సిపాళ్లు అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈనెల 25 నాటికి వాటికి ర్యాటిఫికేషన్ పొందాలని తెలిపారు. ఇప్పటికే డీసెట్ ద్వారా డైట్ కాలేజీల్లో సీట్లు పొందిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు అనర్హులని స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశాలు పొందే అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించబోదని వివరించారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. రాష్ట్రంలో డీసెట్‌లో 26,442 మంది అభ్యర్థులు అర్హత సాధించారని వివరించారు. రాష్ట్రంలో 10 డైట్ కకాలేజీల్లో 1,400 సీట్లున్నాయనీ, వాటిలో 1,165 మంది ప్రవేశాలు పొందారని తెలిపారు.

వచ్చే మూడ్రోజులకూ భారీ వర్ష సూచన

- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు
- గురువారం 300కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో 12.23 సెంటీమీటర్ల వాన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. ఆరెంజ్ అలర్ట్ జాబితాలో ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఎక్కువ ప్రాంతాల్లో మోస్తరు వానలు పడతాయి. ఎల్లో హెచ్చరిక జాబితాలో భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వాన, అక్కడక్కడా భారీ వర్షం పడే సూచనలున్నాయి. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయొచ్చు.

తెలంగాణ మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. మరోవైపు వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతున్నది. దానికి అనుబంధంగా ఉపరితల చక్రవాత ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల వరకు కొనసాగుతోంది. ఈ అల్పపీడనం రానున్న 24 గంటల్లో చురుగ్గా కదులుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తాంధ్ర - దక్షిణ ఒడిశా ప్రాంతాల మధ్య తీరాన్ని తాకే అవకాశముంది. పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన మరో ఉపరితల ఆవర్తనం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా, తెలంగాణ, ఉత్తర మహారాష్ట్ర, దక్షిణ గుజరాత్ మీదుగా ఈశాన్య అరేబియన్ సముద్రం వరకు సముద్ర మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తు నుంచి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవరించి ఉంది. దీని ఫలితంగా తెలంగాణలో వర్షాలు పడుతున్నాయి.

గురువారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 300కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం రికార్డయింది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో అత్యధికంగా 12.25 సెంటీమీటర్ల అతి భారీ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో పది సెంటీమీటర్లు, మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం వడ్డే కొత్తపల్లిలో 7.4 సెంటీమీటర్ల చొప్పున భారీ వర్షం పడింది. గురువారం మహబూబాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కామారెడ్డి, వరంగల్, జనగాం జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల భారీ వర్షం కురిసింది.

కెటిఆర్‌కు సింగపూర్ తెలుగు సమాజం స్వర్ణోత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగపూర్ తెలుగు సమాజం స్వర్ణోత్సవాలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఆహ్వానం అందింది. ఆగస్టు 31న మెరీనా బే సాండ్స్‌లో జరిగే వేడుకలకు ప్రధాన అతిథిగా హాజరుకావాలంటూ సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షులు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి కెటిఆర్‌కు లేఖ రాసింది. తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ వారసత్వానికి ప్రతినిధి అయిన కేటీఆర్ రాక సింగపూర్ తెలుగు సమాజానికి స్ఫూర్తినిస్తుందని ఆ లేఖలో ఆయన కొనియాడారు. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం సింగపూర్ తెలుగు సమాజం కృషి చేస్తుందని తెలిపారు. సింగపూర్‌లో ఉండే తెలుగు ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొని తమ సంస్థకు గౌరవం ఇవ్వాల్సిందిగా ఆయన కేటీఆర్‌ను కోరారు. సింగపూర్ తెలుగు సమాజం ఆహ్వానాన్ని కేటీఆర్ అంగీకరించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్లు

- త్వరలో షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిఎస్‌డబ్ల్యు, బిబిఎ, బిసిఎ, బిబిఎం కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియకు త్వరలోనే షెడ్యూల్ విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఎ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలతోపాటు ఎయిడెడ్ డిగ్రీ కాలేజీల్లో (సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు మాత్రమే), ప్రయివేటు డిగ్రీ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపడతామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి రిజర్వేషన్లు, రోస్టర్, స్థానిక రిజర్వేషన్లను పాటిస్తామని వివరించారు. పారదర్శకంగా, న్యాయబద్ధంగా చేపడతామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశాలు విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌నకు అనర్హులని స్పష్టం చేశారు. త్వరలోనే స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నమ్మకం లేకుంటే రాహుల్‌గాంధీ రాజీనామా చేయాలి

- రాయబరేలి ఓటర్‌లిస్టు అనుమానాలపై ఇసికి ఫిర్యాదు చేస్తాం
- ఎంపి రఘునందన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇవిఎంలపై నమ్మకం లేకుంటే రాయబరేలిలో రాహుల్‌గాంధీ రాజీనామా చేయాలనీ, అక్కడ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహణకు తమ ప్రభుత్వం సిద్ధమేనని బిజెపి ఎంపి ఎం రఘునందన్‌రావు చెప్పారు. అక్కడ గెలిచి చూపాలని సవాల్ విసిరారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలు డోర్ టూ డోర్ క్యాంపెయిన్ చేసి రాయబరేలిలో 71,977 ఫేక్ అడ్రస్‌లలో దొంగ ఓట్లు గుర్తించామనీ, రాహుల్ గాంధీ ఎన్నికను రద్దు చేయాలని ఈసీకి ఫిర్యాదు చేయబోతున్నామని తెలిపారు. ప్రియాంక గాంధీ గెలిచిన వయనాడ్, బెంగాల్‌లో మమతాబెనర్జీ గెలిచిన స్థానంపైనా, డింపుల్, అఖిలేష్ నియోజకవర్గాలపైనా తమకు అనుమానం ఉందని చెప్పారు. బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో అక్రమంగా చొరబడ్డ బంగ్లాదేశీయుల ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షనేతకు దేశంలోని వ్యవస్థలపై నమ్మకం లేకపోవడం బాధాకరమన్నారు. బ్యాలెట్ పేపర్లకు, ఇవిఎంలకు మధ్య తేడా ఏంటని రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు ఎప్పుడైనా శాస్త్రీయంగా ఒక స్టడీ చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు సరే ఓడిపోతే తప్పు అని మాట్లాడటం సరిగాదన్నారు. దేశప్రతిష్టను దిగజార్చే పనిలో రాహుల్‌గాంధీ ఉన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి ఓపిక ఉంటే తెలంగాణలో స్థానిక సంస్థలను బ్యాలెట్ పేపర్లతోనే పెట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని అవమానించే రీతిలో, విశ్వాసం లేకుండా వ్యవహరించకూడదని కోరారు.

ఒప్పో కె13 టర్బో 5జి సిరీస్ విడుదల

హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ కంపెనీ ఒప్పో కొత్తగా ఒప్పో కె13 టర్బో సిరీస్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇందులో రూ.24,999 నుంచి ధరలు ప్రారంభమవుతాయని పేర్కొంది. కె13 టర్బో 5జి, కె13 టర్బో ప్లస్ 5జి వేరియంట్లను తొలుత విడుదల చేసినట్లు ఆ కంపెనీ పేర్కొంది. ఇవి స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ ఎస్‌ఒసితో లభిస్తాయని తెలిపింది. 7000 ఎంఎహెచ్ బ్యాటరీ, 6.8 అంగుళాల డిస్‌ప్లే, 80వాట్ ఫాస్ట్ ఛార్జింగ్‌తో వస్తాయని పేర్కొంది. 16ఎంపి ఫ్రంట్ కెమెరా, 50ఎంపి మెయిన్ కెమెరాతో డిజైన్ చేసింది. ఆగస్టు 27 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభ్యమవుతాయి తెలిపింది.

ఒఆర్‌ఎస్‌ఎల్ జీరో ఎలక్ట్రోలైట్ డ్రింక్ విడుదల

హైదరాబాద్ : ఎలక్ట్రోలైట్ పానియ ఉత్పత్తుల బ్రాండ్ ఒఆర్‌ఎస్‌ఎల్ కొత్తగా జీరో ఎలక్ట్రోలైట్ డ్రింక్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. దీన్ని చక్కెర లేకుండా మామిడి గుజ్జుతో తయారు చేశామని, కేలరీల పట్ల జాగ్రత్త గల వారికి అనువైన హైడ్రేషన్ అందిస్తుందని కెన్వ్యూ ఇండియా సెల్ఫ్‌కేర్ బిజినెస్ హెడ్ ప్రశాంత్ సిండే పేర్కొన్నారు. ఇది రీహైడ్రేషన్‌ను అందించడంలో సహాయపడుతుందన్నారు.

డిసిసిబి, పిఎసిఎస్, టెస్కాబ్ మేనేజింగ్ కమిటీల పదవీకాలం పొడిగింపు

రాష్ట్రంలో డిసిసిబి, పిఎసిఎస్, టెస్కాబ్ మేనేజింగ్ కమిటీలకు మరో ఆరు నెలలు గడువు పొడిగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

వీల్ ఆఫ్ హోప్‌తో మాతృత్వపు కలలు సాకారం

ఒయాసిస్ ఫెర్టిలిటీ వెల్లడి


ప్రజాశక్తి - హైదరాబాద్ : తమ సంస్థ కొత్తగా చేపట్టిన 'వీల్ ఆఫ్ హోప్' కార్యక్రమంతో మాతృత్వపు కలలను సాకారం చేస్తున్నామని ఒయాసిస్ ఫెర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా జి రావు తెలిపారు. దేశంలోని వివిధ కేంద్రాల్లో 600కు పైగా జంటలకు మాతృత్వ ఆశలను నెరవేర్చడానికి ఇది సహాయపడిందని ఆయన ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమం ద్వారా రూ.41 లక్షలకు పైగా డిస్కౌంట్లు కల్పించామన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో ప్రేమతో కూడిన సంరక్షణను అందిస్తూ మాతృత్వంలో నమ్మకమైన భాగస్వామిగా ఒయాసిస్ ఫెర్టిలిటీ తన స్థానాన్ని బలోపేతం చేస్తోందన్నారు.

కూతురిపై తండ్రి లైంగికదాడి

- నిజామాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని ఓ గ్రామంలో కన్న కూతురిపై తండ్రి కొన్ని రోజులుగా లైంగికదాడికి పాల్పడుతున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 11 ఏళ్ల తన కూతురిని తండ్రి.. కొంతకాలంగా అసభ్యకర వీడియోలు చూపిస్తుండేవాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం లైంగికదాడి చేసేందుకు ఒత్తిడి చేశాడు. కాగా, తన తల్లి పని నిమిత్తం బయటకు వెళ్లే సమయంలో.. 'నన్ను వదిలి ఎక్కడికీ వెళ్లొద్దు. నాన్నను చూస్తే భయమేస్తుంది.' అంటూ బాలిక తల్లి వద్ద రోదిస్తూ బతిమాలింది. దాంతో తల్లి ఏమైందని కూతురిని ఆరాతీయగా.. అసలు విషయం బయటపడింది. ఆమె కుటుంబ సభ్యులు, బంధువులకు తెలుపగా వారు సముదాయించి వెళ్లిపోయారు. ఈ విషయమై గ్రామస్తులకు తెలియగా గ్రామపంచాయతీ వద్ద చర్చించడంతో వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం బాలిక తండ్రి పరారీలో ఉన్నాడు. బాలిక తల్లి తన బంధువులతో కలిసి పోలీసులను ఆశ్రయించి భర్తపై ఫిర్యాదు చేసింది.



విద్యుద్ఘాతంతో పారిశుధ్య కార్మికుడు మృతి

- సిద్దిపేట జిల్లా వేచరేణి గ్రామంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ జెండా ఆవిష్కరణ కోసం ఏర్పాట్లు చేస్తుండగా.. ప్రమాదవశాత్తు జెండా పైపు విద్యుత్ వైర్లకు తగిలి విద్యుద్ఘాతంతో పారిశుధ్య కార్మికుడు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ. మోహిన్ పాషా (32) అదే గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నారు. శుక్రవారం జరిగే జాతీయ జెండా ఆవిష్కరణ కోసం విధినిర్వహణలో భాగంగా గురువారం జెండా పైపు (ఇనుప) శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జెండా పైపు 11 కేవీ విద్యుత్ వైర్లకు తాకడంతో మోహిన్ అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ.కోటి

- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు
- ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులు
- సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలవండి
- వరద సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్‌పిలకు మంత్రి పొంగులేటి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు రూ.కోటి అత్యవసర నిధులు మంజూరు చేస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వరద సహాయక చర్యలపె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణరావుతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలు, పోలీస్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో మూడ్రోజుల పాటు భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గడచిన 24 గంటల్లో పది సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల పాటు రెడ్‌అలెర్ట్ జోన్‌లో ఉన్న మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను, ఎస్‌పిలను అప్రమత్తం చేశారు. స్థానిక పరిస్థితుల మేరకు సహాయ చర్యల కోసం అవసరమైన జిల్లాలకు మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామనిని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని కలెక్టర్లను ఆదేశించారు. విపత్తుల నిర్వహణా శాఖ ఆయా జిల్లాల్లో ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, రహదారులు, పోలీస్ విభాగాలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని కోరారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని గస్తీ కోసం నియమించాలని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు, ముంపు ప్రాంతాల్లో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం వరద తాకిడికి గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి వారికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని కలెక్టర్లకు సూచించారు. అర్హులైన పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని సూచించారు. హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

దిండా రైతుల అరెస్ట్.. ఉద్రిక్తత

- పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు
- అల్వాల్ పోలీస్టేషన్‌కు..ఆ తర్వాత వారి ఇళ్లకు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు భూముల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు చింతలమానేపెల్లి మండలం దిండా గ్రామస్తులు చేపట్టిన పాదయాత్ర గురువారం ఉద్రిక్తతకు దారి తీసింది. 30, 40 ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు లాక్కుంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దిండా గ్రామస్తులు ఈనెల ఆరో తేదీన గ్రామం నుంచి హైదరాబాద్‌కు పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. గురువారం హైదరాబాద్ శివారు ప్రాంతం వరకు వెళ్లగా అక్కడి పోలీసులు అరెస్టు చేసి ముందుగా అల్వాల్ పోలీస్టేషన్‌కు తీసుకెళ్లారు.. అక్కడి నుంచి చింతలమానేపెల్లికి తరలించారు. మధ్యలో కాగజ్‌నగర్ మండలం డాడా నగర్ వద్ద పోలీసు వాహనాన్ని బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బిఆర్‌ఎస్ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అనంతరం ఆర్‌ఎస్‌పిని ఎత్తుకెళ్లి వాహనంలో ఎక్కించి సిర్పూర్ పోలీస్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా.. అక్కడ బిఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. దీంతో ఆయనను కౌటాల పోలీస్టేషన్ తరలించారు.

ఇది పిరికి పంద చర్య : ఆర్‌ఎస్‌పి

పోడు రైతుల అరెస్టు పిరికిపంద చర్య అని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలం డాడా నగర్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులను హైదరాబాద్ శివారులో అక్రమంగా అరెస్టు చేసి మూడు బస్సుల్లో ఇక్కడికి తరలించడం దారుణమైన చర్య అన్నారు.

రైతులు తమ బాధలు చెప్పుకోవడానికి వస్తే అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. లగచర్ల, గద్వాలలో రైతులకు బేడీలు వేసిన ప్రభుత్వం.. నేడు దిండా రైతుల పట్ల దారుణంగా వ్యవహరించిందన్నారు. గతంలో కెసిఆర్ పాలనలో రైతులు స్వర్ణయుగం చూసారని, రేవంత్‌రెడ్డి వచ్చాక రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో 550 మంది రైతులు మరణించారని తెలిపారు. రేవంత్‌రెడ్డి మానవత్వం ఉన్న ముఖ్యమంత్రి అయితే రైతులను కలిసి మాట్లాడి వారి సమస్యకు పరిష్కారం చూపేవారన్నారు.



కేర్‌లో ఎముకలు, కీళ్ల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - హైదరాబాద్ : నగరంలోని నాంపల్లిలోని కేర్ హాస్పిటల్స్‌లో ఎముకలు, కీళ్ల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి మాజీ క్రికెటర్ మొహమ్మద్ అజహరుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఎముకలు, కీళ్ల ఆరోగ్యం కోసం అవగాహన, సకాలంలో చికిత్స కీలకం.' అని అజహరుద్దీన్ అన్నారు. 'ప్రజలకు నివారణ, ముందస్తు గుర్తింపు, ఆధునిక చికిత్సలపై అవగాహన కల్పిస్తున్నాం," అని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ అగ్గసరే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ ప్రభాకర్, శివకుమార్, మధు గడ్డం తదితరులు పాల్గొని ఆరోగ్య చిట్కాలు, చికిత్సల గురించి వివరించారు.

ఐకెపి విఒఎలకు రూ.20 వేల వేతనమివ్వాలి

- బకాయిపడ్డ స్త్రీనిధి ఇన్సెంటివ్‌ను వెంటనే చెల్లించాలి
- గ్రామసంఘాల నుంచి విఒఎలకు రావాల్సిన రూ.3 వేల వేతనం ఇవ్వాలి
- ఐబి డైరెక్టర్ నవీన్‌కుమార్‌కు సిఐటియు వినతి



ఐబి డైరెక్టర్ నవీన్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో పనిచేస్తున్న ఐకెపి విఒఎలకు రూ.20 వేల వేతనమివ్వాలని తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్, ఎస్‌వి రమ డిమాండ్ చేశారు. విఒఎలకు ట్యాబ్‌లిచ్చి నెట్‌సౌకర్యం కల్పించాలని, సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులివ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో ఐబి డైరెక్టర్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. విఒఎల సమస్యల పరిష్కారం కోసం ముగ్గురు డైరెక్టర్లతో కమిటీ వేశామని, వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని డైరెక్టర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం నగేశ్, వెంకటయ్య, కోశాధికారి సుమలత, రాష్ట్ర కార్యదర్శి వసీయా బేగం, రాష్ట్ర కమిటీ సభ్యులు అంజన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దృష్టికి పలు సమస్యలను రమ, రాజ్‌కుమార్ తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ స్థాయిలో పనిచేస్తున్న విఒఎలకు గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ ప్రకారం గ్రామ సంఘం నుండి రూ.3 వేల వేతనం అందని విషయాన్ని ప్రస్తావించారు. సెర్ప్ నుంచి వచ్చే రూ.5 వేల వేతనం మాత్రమే అందుతోందని తెలిపారు. స్త్రీనిధి ఇన్సెంటీవ్ రెండేండ్లుగా అందట్లేదని వాపోయారు. గ్రామసంఘాల్లో ల్యాప్‌టాప్‌లు లేక ఆన్‌లైన్ పనులకు ఫోన్లు సపోర్ట్ చేయక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ల్యాప్‌ట్యాప్‌లు, ట్యాబ్‌లు ఇవ్వాలనీ, లాగిన్ అవకాశం ఐకెపి విఒఎలకే ఇవ్వాలని కోరారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు విఒఎల వ్యక్తిగత ఖాతాల్లో జమచేయాలని కోరారు. మూడు నెలలకు ఒక్కసారి విఒఎలను రెన్యువల్ చేసే పద్ధతిని తీసేసి కనీసం రెండేళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన విఒఎలకు సిసిలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

భారీ వర్షాలు.. జల ప్రవాహం

- జలాశయాల్లోకి పోటెత్తుతున్న వరద
- మత్తడు దుంకుతున్న చెరువులు, కుంటలు
- రహదారులపై నుంచి పారుతున్న నీరు
- ఏడుపాయల ఆలయం మూసివేత
- హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ 10 గేట్లు ఎత్తివేత
- ఉధృతంగా మూసీ



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. చెరువులు, కుంటలు మత్తడి పోస్తుండటంతో రోడ్లపై నుంచి వరద పారుతోంది. గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మహబూబ్‌నగర్‌లో జాతీయ రహదారి తెగిపోయింది. హైదరాబాద్‌లోనూ వరద నీరంతా జంట జలాశయాల్లోకి చేరుతోంది. హిమాయత్‌సాగర్ గేట్లను ఎత్తడంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. వరద ప్రవాహం పలుచోట్ల రాకపోకలకు ఆటంకంగా మారింది. సింగూరు నుంచి నీరు విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గా ఆలయం వద్ద వరద పోటెత్తింది. దాంతో ఆలయాన్ని తాత్కాలికంగా మూసేశారు. మూడ్రోజుల పాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమైంది.

జంట జలాశయాలు

హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు భారీగా వరద నీరు వస్తుండటంతో గురువారం హిమాయత్‌సాగర్ రిజర్వాయర్ 10 గేట్లను జలమండలి అధికారులు ఎత్తారు. 10 గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం హిమాయత్‌సాగర్‌కు 19000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 12046 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉంది. మరోవైపు ఉస్మాన్‌సాగర్ (గండిపేట్) రిజర్వాయర్‌కు 2800 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 3.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.919 టీఎంసీలు ఉంది. పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. ప్రస్తుతం 1785.50 అడుగులు ఉంది. జలాశయాల గేట్లు ఎత్తినందున పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిపాలనా యంత్రాంగాలు, హైడ్రా, జిహెచ్‌ఎంసి, పోలీసు అధికారులతో సమన్వయంతో వ్యవహరించాలని జలమండలి అధికారులను జలమండలి ఎండి అశోక్‌రెడ్డి ఆదేశించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది

మూసీ నదికి వరద పోటెత్తుతోంది. పురానాపూల్ వద్ద మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. జియాగూడ బైపాస్ రోడ్డుపై వరద నీరు వస్తుండటంతో పురానాపూల్ నుంచి లంగర్‌హౌజ్ వైపునకు రాకపోకలు బంద్ అయ్యాయి. మలక్‌పేట్‌లోని మూసారాంబాగ్ బ్రిడ్జి పై నుంచి రాకపోకలు నిలిచాయి. జీహెచ్‌ఎంసీ అధికారులు మూసీ తీరవాసులను అప్రమత్తం చేశారు. బేగంబజార్ వద్ద పురాతన భవనం కూలింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. హిమాయత్‌సాగర్‌తోపాటు కోట్‌పల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరింది. ధారూర్ మండలం గురుదొడ్లలో చెరువుకు గండి పడి పంట పొలాలు నీట మునిగి పైర్లు కొట్టుకుపోయాయి. దాదాపుగా 50 ఎకరాల పంట నష్టం జరిగింది. వికారాబాద్ జిల్లా దోమలో 118.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తాండూర్‌లో పత్తి పంట నీటమునిగింది. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్‌పి నారాయణరెడ్డి పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు.

బుధవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా మొత్తంగా 81.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని నల్లకుంట చెరువు అలుగు పారడంతో రేమద్దుల- కేతెపల్లి రోడ్డుపైకి భారీగా వరద వచ్చింది. నాగర్‌కర్నూల్ పరిధిలో దుందుభి నదికి భారీగా వరద చేరడంతో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరింది. పంట పొలాలు మునిగిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాల మైదానం ముంపునకు గురైంది. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపిడిఒ, పోలీస్టేషన్, ఎస్‌సి, బిసి వసతి గృహాలు వరద నీటిలో చిక్కుకున్నాయి.

అమర్ రాజా కంపెనీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని దగ్గర గల ఐటీ పార్క్‌కు ఆనుకొని ఉన్న జాతీయ రహదారి44 మీదుగా భారీగా వరద నీరు పారడంతో గురువారం ఉదయం అకస్మాత్తుగా తెగిపోయింది. అమర రాజా కంపెనీ బస్సు ఉద్యోగులను తీసుకొని వెళుతుండగా రోడ్డు తెగిపోవడంతో ముందుభాగం వరదలోకి దిగింది. డ్రైవర్ అప్రమత్తతతో ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. ఉద్యోగుల అత్యవసర డోర్ వెంట బయటకు వచ్చారు. క్రేన్ సహాయంతో బస్సును తీశారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమామహేశ్వరం కొండపై నుంచి ఉధృతంగా నీరు కిందికి పారుతోంది. బండ రాళ్లు రోడ్డుపై పడుతున్నాయి. దీంతో మూడ్రోజులపాటు ఉమామహేశ్వరం దర్శనం బంద్ చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.

జలదిగ్బంధంలో ఏడుపాయల

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోనికి 5000 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్టు అధికారులు చెప్పారు. ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని వదలడంతో మెదక్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గ మాత ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆలయం ముందున్న నదీ పాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఘణపురం ఆనకట్ట పూర్తిగా నిండి పొంగిపొర్లుతోంది. మంజీరా నది పాయలు పరవళ్లు తొక్కుతున్నాయి. భారీ వర్షాలతో నల్లగొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని లక్ష్మీదేవి గూడెం సమీపంలో కాజ్వే మీదుగా వరద ప్రవాహం పెరగడంతో సూర్యాపేట నుంచి మిర్యాలగూడకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.

సాధారణ స్థాయిలోనే మున్నేరు

ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించారు. పలుచోట్ల వాగులు వంకలు ఉప్పొంగి రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. పాలేరు రిజర్వాయర్‌లోకి గరిష్ట నీటిమట్టానికి మించి నీరు చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా, ప్రస్తుతం 23.45 అడుగుల నీరు ఉంది. 9990 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా అంతే మొత్తం బయటకు వదులుతున్నారు. వైరా రిజర్వాయర్ నీటిమట్టం 18.3 అడుగులకుగాను 18.9 అడుగుల వరకు నిల్వ ఉంది. 1840 క్యూసెక్కుల నీరు నిలకడగా వచ్చి చేరుతుండగా ఆ నీటినంతా విడుదల చేస్తున్నారు. చెరువులు అలుగుబారుతున్నాయి. ఆకేరు, మున్నేరు పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసినా మున్నేరులో ప్రవాహ ఉధృతి తక్కువగానే ఉండటంతో ముంపు ప్రాంతం ఊరట చెందింది. మున్నేరులో 16 అడుగులకు నీరు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

తెలంగాణ జాగృతి అనుబంధ విభాగాల నియామకం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి సంస్థాగత నిర్వహణలో భాగంగా పలు అనుబంధ విభాగాలకు అధ్యక్షులతో పాటు 11 జిల్లాలకు బాధ్యులను నియమించినట్టు ఆ సంస్థ అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివాసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా లోకిని రాజు బిసి జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా ఇత్తరి మారయ్య ఉపాధ్యక్షులుగా ఈగ సంతోష్ ముదిరాజ్, ఎంబీసీ సంచార జాతుల విభాగం అధ్యక్షులుగా రాచమల్ల బాలక్రిష్ణ, సింగరేణి జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా ఎల్. వెంకటేష్ మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా మేక లలిత యాదవ్, యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా కంచర్ల శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా అల్వాల జితేందర్ ప్రజాపతి భూక్యా రవి రాథోడ్, పాలె నిషా లెనిన్, కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్, విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మునుకుంట్ల నవీన్ గౌడ్, సాహిత్య జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా కాంచనపల్లి గోవర్ధన్ రాజు , రైతు జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా మంథని నవీన్ రెడ్డి నియమించినట్టు తెలిపారు. అలాగే ఐటి విభాగానికి శశిధర్ గుండెబోయిన, మైనారిటీ ముస్లీం విభాగానికి మహమ్మద్ ముస్తఫా, క్రిస్టియన్ విభాగానికి జి. డేవిడ్, ఆటో జాగృతి రాష్ట్ర అధ్యక్షులుగా మహమ్మద్ అబ్దుల్ సలీంను నియమించినట్టు తెలిపారు. నూతన నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని కవిత తెలిపారు. నూతన బాధ్యులు సంస్థ బలోపేతానికి, ఆశయాల సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.. నియామకాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.

ప్రీప్రైమరీ, పిఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలి

- ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రీప్రైమరీ, పిఎం శ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలనీ, విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనుబంధం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, ఐసిడిఎస్ ముఖ్య కార్యదర్శులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. విద్యావాలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అంగన్‌వాడీలకు అదనంగా ఇవ్వాలని కోరారు. ఆరేళ్ల లోపు పిల్లలకు ప్రయివేటు స్కూళ్లను నడపడానికి అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని విన్నవించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. 1995 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను పౌష్టికాహారంతో పాటు విద్యను అందించే ఇసిసిఇ కేంద్రాలు(ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్)గా మార్చాలని అంగన్‌వాడీలు అడుగుతున్నారని, దానికి ఆటంకంగా ఉన్న బిఎల్ఒ, ఐసిడిఎస్‌కు సంబంధం లేని అదనపు పనులు రద్దు చేయాలని విజ్ఞప్తిచేశారు.

ఆర్‌ఎస్‌పి, ఇతర నాయకులను విడుదల చేయాలి

- అరెస్టులపై కెటిఆర్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సహా ఇతర నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచినందుకు వారిని అరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి, వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్బంధించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమని విమర్శించారు. పోడు రైతులను వేధించడం ఆపి, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న వారిని తక్షణం విడుదల చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న బిఆర్‌ఎస్ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి సర్కారు పతనం దగ్గరలోనే ఉందని ఆయన హెచ్చరించారు.

మూసీ వంతెనల పనులను పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ వాసుల చిరకాలంగా ఎదురుచూస్తున్న మూసీ నదిపై వంతెనల నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. నదిపై బ్రిడ్జిల నిర్మాణంలో కాంగ్రెస్ నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ వాసుల కలను నిజం చేయడానికి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 జనవరిలో రూ.545 కోట్లను 15 వంతెనల నిర్మాణానికి మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులను ప్రారంభించిందని గుర్తుచేశారు. ఈ వంతెనల రాకతో హైదరాబాద్ వాసుల రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. వంతెనల పొడవు దాదాపు 150 నుంచి 200 మీటర్ల వరకు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పనులన్ని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. మూసీ నదిపై ఒక్క వంతెన కూడా ఇంకా పూర్తి కాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత, చేతగానితనానికి నిదర్శనంగా మారాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనికిమాలిన ప్రభుత్వమనీ, వారిది పనికిమాలిన పాలన అని కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.